

"అంతెందుకు? నేను నటిగా వచ్చిన కొత్తల్లో నేను కలిసి నటించిన ప్రతి హీరోకీ నాకూ ఏదో ఒకటి కల్పించి రాసేవారు. నా గురించీ, నాగార్జున గురించి రకరకాల వార్తలు పత్రికల్లో వచ్చినప్పుడు చాలా బాధపడ్డాను.

అయితే నాగార్జున ప్రతి నిమిషం నాకు ధైర్యం చెప్పేవారు. సమాజానికో మరొకరికో భయపడి మనం నటించాల్సిన అవసరం లేదు అన్న సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి నాగార్జున. పైగా తాను మనస్ఫూర్తిగా నమ్మిన విషయాలను తు.చ. తప్పకుండా ఆచరించే వ్యక్తి ఆయన. నిజంగా నాగార్జునతో నా స్నేహం, నా అనుబంధాల పట్ల గర్విస్తున్నాను. మా ప్రేమకు ఎవరి గుర్తింపూ అవసరం లేదు" అన్నారు అమల.

"ఇంతకు మునుపుకన్నా ప్రస్తుతం నాకు కాస్త తెలివిగా వ్యవహరిస్తున్నానని అనుకుంటున్నాను. అయితే నా అభిప్రాయాలు అప్పుడూ ఇప్పుడూ ఒకే విధంగా వున్నాయి. వాటిని అమలు పరచే విధానంలో మాత్రం తేడా వుంది. ఈ రోజు మేమిద్దరం ఒకరి కోసం ఒకరున్నాం. ఈ భావాన్ని ఒక్క వాక్యంలో చెప్పడం అసాధ్యం. మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి అపారమైన నమ్మకం వుంది. మా ఇద్దరి మధ్యనా ఎలాంటి సమస్యలూ లేవు" అన్నారు నాగార్జున.

"మా ఇద్దరికీ జూన్ 11వ తేదీన వివాహం జరిగింది. ఇది చాలా నిరాడంబరంగా జరిగిన అతి చిన్న ఉత్సవం. కొద్దిమంది నా స్నేహితులు, అమల స్నేహితులు వచ్చారు. నేను చాలా కొద్దిమందిని మాత్రమే పిలిచాను. సినిమా పరిశ్రమ నుంచి డానీ, ముకుల్ ఆనంద్‌లనిద్దర్ని మాత్రమే పిలిచాను. అమల సోదరుడు ఆస్ట్రేలియాలో వున్నారు. ఆయన భార్య గర్భవతి. ప్రసవించే రోజులు దగ్గరయినందు వల్ల ఆయన రాలేకపోయారు. పైగా మా వివాహపు తేదిని హఠాత్తుగా నిర్ణయించుకున్నాం. అందువల్ల ఆయన రావడానికీ వీలు లేకపోయింది. ఆయన స్థానంలో 'డానీ' వుండి వివాహం జరిపించారు. నిజానికి నవంబర్‌లో వివాహం చేసుకుందామనుకున్నాం. అయితే ఇద్దరం షూటింగ్స్ వల్ల చాలా బిజీగా వున్నందున ముహూర్తాన్ని ముందుకు జరపవలసి వచ్చింది" అని చెప్పారు నాగార్జున.

వీరిద్దరికీ అతి ఇష్టమైనదేమిటో తెలుసా?

ఇద్దరూ కలిసి వున్నప్పుడు తీసిన ఛాయా చిత్రాలు. అవే ఇద్దరికీ మధురస్మృతులు.

నాగార్జునతో కలిసి వుండడం కన్నా జీవితంలో అమలని ఆనందపరచిన విషయం మరొకటి లేదు.

నాగార్జునకు కూడా అంతే!

ఈ ప్రేమజంట పదికాలాల పాటూ ఇలాగే వర్ధిల్లాలని ఆశిద్దాం.

— కిశోర్.జె.

## మంచి సంబంధం

ఒకరోజు సాయంత్రం పరుగు పరుగున మాధవయ్యగారు పంతులు గారిని వెంట తీసుకొని వచ్చి—

"ఏవోయ్! కాంతం! ఎక్కడున్నావే... త్వరగా రా... పంతులుగారు మంచి సంబంధం తీసుకువచ్చారు" అని ఉత్సాహంగా అన్నారు.

"ఆ...! ఎంత చల్లని వార్త చెప్పారండి... ఇప్పుడే వచ్చేస్తాను" అని లోపలికి వెళ్ళి పంచదార నీళ్ళు కలిపి తీసుకువచ్చింది.

"ఆ! ఇప్పుడు చెప్పండి పంతులుగారు ఎవరు అబ్బాయి, ఏం చేస్తుంటాడు?" అని వినయ పూర్వకంగా అడిగింది కాంతమ్మ.

"అబ్బాయికి గవర్నమెంటు ఉద్యోగం, బాగా ఉంటాడు మీరు ఊ...! అంటే ఈ మాట పదమూడో సంబంధం కాయం చేసేద్దాం" అని పంతులుగారు అన్నారు.

"ఇంతకీ ఏ ఆఫీసులో చేస్తాడు బాబు" అని

**మినీకథ**

ఇంట్లో ఉన్న మామ్మగారు వచ్చి కలుగ చేసుకున్నారు.

"మున్సిపల్ ఆఫీసులో చేస్తాడండీ" అని సమాధానం చెప్పారు పంతులుగారు.

"అలాగ! అయితే పెద్ద ఉద్యోగమే అయి ఉంటుంది" బామ్మగారు అన్నారు.

"అందులో ఏం చేస్తుంటాడు పంతులుగారు" ఈసారి మధవయ్యగారి వంతు.

"అదేనండి మున్సిపాల్టీ లారీలో చెత్త పోసేవారుంటారు కదా..."

"ఆహా వాళ్లకు సూపర్ వైజరా" అని అతని మాట పూర్తి కాకుండామే అంది కాంతమ్మ.

"అది కాదండి, ఆ చెత్తపోస్తే, వాటిని లారీ మీద ఉండి చెత్తనంతా క్రిందపడకుండా సరిగ్గ వేస్తాడు" అని నమ్రతగా అన్నాడు పంతులుగారు...

అంతే ఆయన వారం రోజులు వరకు హాస్పిటల్‌లో కోలుకోలేదు.

— పురిపి నారాయణమూర్తి.